

విద్యార్థులు బడిబయట ఉండొద్దు

ఐటీడీఏ పరిధి గ్రామాల్లో చదువుకునే విద్యార్థులు బడిబయట ఉండొద్దని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. - 8లో▸



అక్రమాలపై విచారణ చేపట్టాలి

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $42^0/28^0$

జిల్లాలో ఉదయం పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగి వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బీసీ హాస్టల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలోని బీసీ వెల్ఫేర్ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రామ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 10వ తరగతి వరకు ప్రీమెట్రిక్, ఇంటర్ నుంచి పీజీ వరకు పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్‌లో ప్రవేశానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో bchorter.cff.gov.in వెబ్‌సైట్ ద్వారా జూన్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



కేయూ క్యాంపస్: రాష్ట్రంలో సంస్కృతం యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించాన్ని హర్షిస్తూ హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలంగాణ సంస్కృత స్కాలర్స్ అండ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు లింగానాయక్ మాట్లాడుతూ 2009లో మెదక్ జిల్లా కొలిచెర్లలో సంస్కృత సాహిత్య సదస్సులు నిర్వహించినప్పుడు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు సంస్కృత యూనివర్సిటీ ఏర్పాటుకు హామీ ఇచ్చారని.. అయితే చివరికి సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని మహాకవి మల్లినాథ సూరిపేరుతో సంస్కృత విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తానని ప్రకటించారని పేర్కొన్నారు. సంస్కృత పరిశోధకులు ప్రకాశ్, శేఖర్, భానుప్రసాద్, అశోక్, నాగరాజు, రాజేష్, సంస్కృత విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి



వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ పింగిళి రమేష్‌రెడ్డి ఎన్నికైనట్లు అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి పుల్లెల గోపీచంద్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన వార్షిక జనరల్ బాడీ సమావేశం అనంతరం జరిగిన ఎన్నికల్లో రమేష్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ పదవిలో నాలుగేళ్ల పాటు కొనసాగే రమేష్‌రెడ్డి జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను అసోసియేషన్ బాధ్యులు రమేష్‌కుమార్, డాక్టర్ జితేందర్‌రెడ్డి, డి.నాగకిషన్, టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు కొమ్ము రాజేందర్, కిశోర్, భాస్కర్, కృష్ణవేణి, హన్మంతరావు, శ్యాంకుమార్, ప్రసాద్, శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ్, శైలజ, వెంకటస్వామి, మహేష్, ప్రణయ్, రమేష్ అభినందించారు.

'బెస్ట్ అవైలబుల్' స్కీంకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్/కరీమాబాద్: హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని గిరిజన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంకు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి హేమకళ, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య వేర్వేరు ప్రకటనల్లో కోరారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను 3, 5, 8 తరగతుల్లో చేరే విద్యార్థులు ఈనెల 18 నుంచి జూన్ 2వ వరకు దరఖాస్తులను హనుమకొండ అంబేడ్కర్ భవనం ఎదుట ఉన్న జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన ఎంపిక ఉంటుందని తెలిపారు.

సీఐడీకి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

వరంగల్ క్రైం: హనుమకొండ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ జీ సోమవారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. గతంలో సీఐడీ విభాగంలో పనిచేయటానికి దరఖాస్తు పెట్టుకోగా ఇటీవల హైదరాబాద్ సీఐడీ విభాగానికి బదిలీ అయ్యింది. దీంతో వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం ఆయనను రిలీవ్ చేశారు. ఒకటి రెండు రోజుల్లో రిపోర్ట్ చేయనున్నారు.

ఒకేషనల్ కళాశాలకు డీఐఈఓ ఆఫీస్ తరలింపు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా ఇంటర్ విద్య(డీఐఈఓ) కార్యాలయాన్ని హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు మార్చినట్లు డీఐఈఓ గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నేళ్లుగా సుబేదారిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ కార్యాలయాన్ని ఒకేషనల్ జూనియర్ కళాశాలలోనికి తరలించినట్లు పేర్కొన్నారు.

తాగునీరేది..?

రూ.కోట్లు ఖర్చుచేసి.. వారానికోమారు ఇస్తారా..

- నిధులు ఇవ్వకపోతే పనులెట్ల
- నత్తనడక పనులపై కార్పొరేటర్ల అసహనం
- ఇబ్బందులు లేకుండా చూస్తాం: మేయర్ గుండు సుధారాణి
- జీడబ్ల్యూఎంసీ సర్వసభ్య సమావేశంలో ఎజెండా తీర్మానాలకు ఆమోదం




సమావేశంలో ఎమ్మెల్సీ సారయ్య, కార్పొరేటర్లు, (ఇన్‌సెట్‌లో) కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: 'తాగునీటికి రూ.వంద కోట్లు ఖర్చు చేస్తున్నామంటున్నారు.. రోజూ నీళ్లిస్తున్నామని చెబుతున్నారు.. కాజీపేటలో వారానికోమారు కూడా నల్లాలకు తాగునీరు రావడం లేదు.. దినం విడిచి దినమైనా సరఫరా చేయాలి. లేకపోతే వాటర్ ట్యాంక్‌ల వద్ద ధర్నా చేస్తాం'.. అంటూ కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు అధికార పార్టీ కార్పొరేటర్లతో పాటు బీజేపీ కార్పొరేటర్ కూడా తాగునీటి సమస్య అస్తవ్యస్తంగా మారిందంటూ అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల వేగవంతం, నిధుల ప్రతిపాదనలు, పలు సమస్యలపై కార్పొరేటర్లు ప్రస్తావించారు. సోమవారం వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన పాలక మండలి సర్వసభ్య సమావేశానికి ఎక్స్అఫీషియో సభ్యుడు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ కలెక్టర్, బల్దియా ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ హాజరయ్యారు. అజెండాలోని ఎనిమిది తీర్మానాలను కౌన్సిల్‌లో అధికారులు ప్రవేశపెట్టగా.. 452 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాల పెంపు, ఇండోర్ స్టేడియంలో ఒక కోచ్ కాలపరిమితి పెంపు, మరో కోచ్ నియామకానికి సభ్యులు అంగీకరించారు. ఆరేపల్లి ప్రతిమ క్యాన్సర్ ఆస్పత్రి నుంచి తురక చెరువు వరకు బాక్స్ డ్రెయినేజీకి రూ.1.50కోట్లు, నగరంలో పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు, మెయిన్స్ మార్పునకు రూ.2.57కోట్లు, పాడైన స్లూయిస్ వాల్వ్‌ల మార్పునకు రూ.2.08 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి, కాకతీయ సప్తాహం కార్యక్రమానికి రూ.99లక్షలతో పాటు కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు మరో 2 స్వర్గ రథాలు, 2 ఆఖ్రీ సఫర్ రథాలు, ట్రాక్టర్లు, డస్ట్ బిన్ల కొనుగోలుకు చేసిన తీర్మానాలకు సభ్యులు ఆమోదం పలికారు.

సమస్యలపై చర్చ

కాజీపేటలో వారానికి ఒకమారు నల్లానీరు వస్తోంది.. అదికూడా పావుగంట లోపే. దీంతో ప్రజలు నీళ్ల కోసం గోస పడుతున్నారని 62, 63 డివిజన్ల కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్య తీర్చకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తమ ప్రాంతాల్లో నీటి సమస్య ఉందంటూ 13, 35వ డివిజన్ కార్పొరేటర్లు సురేష్ జోషి, దిడ్డి కుమారస్వామి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నల్లా నీరివ్వకపోతే చేతి పంపులు వేయాలని, పాత బోర్లను రిపేరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా బోర్లు వేయడం సుప్రీం కోర్టు నిషేధించిందని సమాధానం ఇచ్చిన మేయర్.. నీటి సరఫరాలో సమస్యలపై ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, 896 కాల్స్ స్వీకరించి 60శాతం సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. కార్పొరేటర్‌గా ఎన్నికై రెండేళ్లు గడిచినా ఇప్పటి వరకు రూ.50లక్షల నిధులిస్తే ఎట్లా? అంటూ ప్రశ్నించిన కాంగ్రెస్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు.. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని, అత్యవసర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలువాలని పలువురు సభ్యులు కోరారు. కుక్క కాటుకు గురైన బాధితులకు బల్దియా నష్ట పరిహారం చెల్లించాలని కోరిన కార్పొరేటర్ మరుపల్లి రవి.. స్వర్గరథాలకు మైకుసెట్లు ఏర్పాటు చేయాలని, ఉర్సు చెరువులో గుర్రెపు డెక్క తొలగించాలన్నారు. ఖమ్మం కార్పొరేషన్ తరహాలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.19వేల చొప్పున వేతనాలు ఇవ్వడంతోపాటు పరికరాలు పంపిణీ చేయాలని కార్పొరేటర్ గుండేటి నరేందర్ సూచించారు. తనకు తెలియకుండా డివిజన్ ప్రతిపాదనలు ఎలా పెడతారని సభ్యుడు వస్కుల బాబు ప్రశ్నించగా.. కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించేది కార్పొరేటర్ అన్న విషయం మర్చిపోవద్దని మేయర్ చురకలంటించారు. స్లమ్ ఏరియాల్లో గతంలో బల్దియా ఇంటి నంబర్లు కేటాయించి అసెస్‌మెంట్, ఓనర్‌షిప్ సర్టిఫికెట్ జారీ చేసిందని, ప్రస్తుతం నిలిపివేయడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ పేర్కొన్నారు. మ్యాన్‌హోల్‌లో పారిశుద్ధ్య కార్మికుడి చేత వ్యర్థాలను తొలగించడం సరికాదంటూ 'సాక్షి దినపత్రిక'లో ప్రచురించిన కథనాలను ప్రస్తావించారు. పార్కులు, సర్కారీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని రక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు. సుమారు మూడుగంటల పాటు సమావేశం కొనసాగింది.

తాగునీటి సమస్యను అధిగమిస్తాం..



వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేసి సమస్యలను అధిగమిస్తాం. రాబోయే వర్షాకాలంలో ముంపు నుంచి కాలనీలను కాపాడేందుకు రూ.150కోట్లతో చేపట్టిన వరద నీటి కాల్వలు, కల్వర్టుల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 33 ప్రధాన నాలాల్లో పూడికతీత పనులు పూర్తవుతున్నాయి. దశల వారీగా అత్యవసర పనులకు నిధులను కేటాయిస్తాం.

\- గుండు సుధారాణి, మేయర్



ఆర్‌టీసీ బస్సులో కౌన్సిల్‌కు కార్పొరేటర్లు

ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆ సంస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్లు దాస్యం అవినవ్ భాస్కర్, సిరంగి సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి వడ్డేపల్లి నుంచి హనుమకొండ మీదుగా ఎంజీఎం వరకు ఆర్‌టీసీ బస్సులో కౌన్సిల్‌కు హాజరయ్యారు. వారి వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కూడా ఉన్నారు.

కౌన్సిల్‌లో కరపత్రాల కలకలం

బల్దియాలో కరపత్రాలు కలకలం రేపాయి. కౌన్సిల్ సమావేశం జరుగుతున్న తరుణంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కరపత్రాలను విసిరేసి అక్కడి నుంచి వెళ్లపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బల్దియా సీపీ ఏసీ రూంకు పరిమితమవుతున్నారని, అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని, ఇంజినీర్ల నిర్లక్ష్యం వల్ల స్మార్ట్‌సిటీ పనుల్లో నాణ్యత లేకుండా పోయిందని కరపత్రాల్లో పేర్కొన్నారు. గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కారించడం లేదని, పైసలిస్తేనే పనులు చేస్తున్నారని తెలిపారు. నిజాయితీ కలిగిన ఐఏఎస్ ఆఫీసర్‌ను కమిషనర్‌గా నియామించాలని, స్టాండింగ్ కమిటీ, కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాలని, ఫ్లోర్ లీడర్లకు ప్రత్యేక చాంబర్లు కేటాయించాలని కరపత్రాల్లో పేర్కొన్నారు. కరపత్రాల విషయమై బల్దియా సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా.. విచారణ చేపట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ప్రభుత్వ భూముల రక్షణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పట్నాయక్

హన్మకొండ అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎల్కతుర్తి, ధర్మసాగర్, కాజీపేట, హసన్‌పర్తి, హనుమకొండ మండలాల పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించాలన్నారు. ఇప్పటి వరకు ఎంత భూమిని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించారు, ఇంకా ఎంత అవసరం ఉందో కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో నిర్వహించిన ల్యాండ్ పూలింగ్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 'కుడా' అనుమతి లేకుండా చేపడుతున్న మైనింగ్ లీజులు, వెంచర్స్, లే ఆవుట్‌లు, తదితర అంశాలపై పక్కా ప్రణాళిక ప్రకారం అధికారులు పనిచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ వాసుచంద్ర, తహసీల్దార్లు రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, రజిని తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకే క్రీడలు

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యాలను వెలికితీయడమే సీఎం కప్–2023 క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడా పోటీలపై సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల స్థాయిలో ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన జట్లను జిల్లా పోటీలకు, అక్కడ ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. మండల స్థాయిలో ఎంపీపీ చైర్మన్‌గా, ఎంపీడీఓ కన్వీనర్‌గా నిర్వహించే ఈ పోటీలలో తహసీల్దార్, ఎంఈఓ, ఎస్సై, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ అబ్దుల్ బారి, జిల్లా స్పోర్ట్స్ అధికారి అశోక్, డీఈఓ అబ్దుల్ హై, ఐడీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడికి రాజ్యాంగ గ్రంథం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న డీఎస్‌పీ నాయకులు

హన్మకొండ అర్బన్: దేశంలోని ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు పి.రమేష్ మహారాజ్, సాయిబాబా, పూలమాల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో డీఎస్‌పీ జిల్లా ప్రచార కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశాన్ని నడిపిస్తున్నది భారత రాజ్యాంగమని, అలాంటి గ్రంథంపై నూటికి 90 శాతం ప్రజలకు అవగాహన లేకనే పార్లమెంట్, ప్రజాస్వామ్యం విఫలమైపోతున్నదని అన్నారు. ఫలితంగా ప్రజాజీవితం అన్ని రంగాల్లో అభివృద్ధి లేక అధోగతి పాలవుతోందని చెప్పారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రాజేష్ మహారాజ్, రత్నాకర్, యుగేందర్, రాకేష్, విష్ణు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: సూర్యాపేటలో ఈనెల 25 నుంచి జరిగే అండర్–16 బాలబాలికల రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు సోమవారం ఫాతిమానగర్‌లోని సెయింట్ గాబ్రీయల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. స్కూల్ మాజీ ప్రిన్సిపాల్ పీటీ సబాష్టియన్ ముఖ్యఅతిథిగా హాజరై ఎంపిక పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 మంది బాలురు, 20 మంది బాలికలు హాజరైనట్లు బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపెల్లి రాజు, డోలీ సాంబయ్య తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామన్నారు. బాలుర జట్టులో ఎస్. విష్ణు, ఎండీ.ఫాల్జుర్‌రెహమాన్, కె.సాయిసానిత్, పి.చరణ్, డి.షణ్ముఖ్, టి.చండీ సాయికుమార్, టి.దేవీశ్రీకుమార్, ఎస్.అద్వైత్‌రెడ్డి, పి.శ్రీవైభవ్, వై.వరుణ్, జేబీ.హృదయ్, పి.విహాన్.. బాలికల జట్టులో జి.దీక్షిత, టి.మీనాక్షి, కె.ప్రీన్సా, జి.మరీహాసినీరెడ్డి, జె.తేజస్వీ, పి.జోషిక, ఎస్.విష్ణుప్రియ, లాస్య, ప్రవళిక, వర్శిక, అఖిల, సుష్మ ఎంపికయ్యారు. కార్యక్రమంలో పీఈటీలు ఎం.కృష్ణ, విజయ్‌కుమార్, కోచ్‌లు ఎండీ.ఇర్ఫాన్, యశ్వంత్ పాల్గొన్నారు.

'సీఎం కప్'ను విజయవంతం చేయాలి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య
- ఓ సిటీ మైదానంలో ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కాశిబుగ్గ: ఈనెల 15 నుంచి మండల స్థాయిలో 22 నుంచి జిల్లా స్థాయిలో నిర్వహించనున్న సీఎం కప్–23 క్రీడలను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ ఓ సిటీ మైదానంలో సీఎం కప్ క్రీడలను స్థానిక ఎమ్మెల్యే నరేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్య దృఢత్వానికి దోహదపడతాయన్నారు. ఈక్రీడల్లో భాగంగా 15 నుంచి 36 ఏళ్ల మధ్య వయస్సున్న వారికి అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో ఆసక్తి కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల రాకెట్

- గోపాలపురం ఓ ఇంటిలో స్కానింగ్ సెంటర్
- పక్కా సమాచారంతో దాడులు
- పరారీలో ల్యాబ్ టెక్నీషియన్



పోలీసుల అదుపులో నిందితులు

హసన్‌పర్తి: నగరంలోని 55వ డివిజన్ గోపాలపురంలోని ఓ నివాస గృహంలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న రాకెట్‌ను జిల్లా వైద్యాధికారులు, పోలీసులు సోమవారం ఛేదించారు. పక్కా సమాచారంతో వారు దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమతి లేని పోర్టబుల్ స్కానర్‌ను సీజ్ చేశారు. స్కానింగ్ సెంటర్ విధులు నిర్వహిస్తున్న రాచర్ల సదానందం, నేతుల సంపత్, రవీందర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ప్రధాన నిందితుడు వేముల ప్రవీణ్ పరారీలో ఉన్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ దయాకర్ తెలిపారు. గోపాలపురం వెంకటేశ్వర కాలనీకి వేముల ప్రవీణ్ అనే ల్యాబ్ టెక్నీషియన్ కొంతకాలంగా ఓ ఇంటిలో స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తుండగా.. అందులో ప్రవీణ్‌తో పాటు రాచర్ల సదానందం, నేతుల సంపత్, రవీందర్ పనిచేస్తున్నారు. ఆ ఇంటి వద్ద నిత్యం గర్భిణుల తాకిడి కనిపించడంతో స్థానికులు అనుమానంతో పోలీసులు, అధికారులకు సమాచారం ఇవ్వడంతో గుట్టు రట్టయింది.

రేపు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

రామన్నపేట : ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడేళ్ల ఇంజనీరింగ్ నాన్–ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి ఈ నెల 17న నిర్వహించే పాలిసెట్–2023 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ బైరి ప్రభాకర్ తెలిపారు. నగరంలోని 15 కేంద్రాల్లో 6,820 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులను గంట ముందుగానే సెంటర్లకు అనుమతిస్తారని తెలిపారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఇవ్వరని స్పష్టం చేశారు.

ట్రెండింగ్ వరంగల్!

ఫుడ్.. షాపింగ్.. లాంగ్ డ్రైవ్!

- గూగుల్‌లో తెగ వెతుకుతున్న నగరవాసులు
- పర్యాటకం, వాతావరణం, బంగారం ధరలపై ఆరా
- పత్తి రేటు తెలుసుకునేందుకు రైతుల ఆసక్తి



సాక్షి, వరంగల్: వరంగల్ సిటీ ట్రెండింగ్‌లో ఉంది. రుచికరమైన ఆహారం, జిహ్వకు వాహ్వా అనిపించే బిర్యానీ. ట్రెండీ డ్రెస్సుల కోసం షాపింగ్. లాంగ్ డ్రైవ్, సెల్ఫ్ డ్రైవ్ కార్లు ఉన్నాయా? బంగారం ధరలు, వాతావరణం ఎలా ఉంది? వరంగల్ నుంచి రైళ్లు ఏసమయంలో అందుబాటులో ఉన్నాయి. ఇలా వివిధ అవసరాలపై వరంగల్‌వాసులే కాదు.. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, తమిళనాడు, కర్ణాటక ప్రజలు కూడా గూగుల్‌లో శోధించడం కనిపించింది. ట్రెండ్స్‌గూగుల్.కామ్‌లో సోమవారం వరంగల్ సిటీ అని టైప్ చేస్తే పైఅంశాలు ఎక్కువగా సెర్చ్ చేసినట్లు ఉంది. వేసవి సెలవులు కావడంతో కుటుంబాలతో కలిసి పర్యాటక ప్రదేశాలకు వెళ్లేందుకు లాంగ్‌డ్రైవ్ కార్లు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో షాపింగ్‌మాళ్ల చిరునామాలు.. అనారోగ్య సమస్యలున్నవారు ఆస్పత్రుల అడ్రస్‌ల కోసం ఎక్కువగా వెతికినట్లు కనిపించింది. సాఫ్ట్‌వేర్ సంస్థ జెన్‌పాక్ట్ అడ్రస్‌తో పాటు నిట్ వరంగల్ కటాఫ్ మార్కులు కూడా ఎక్కువగానే శోధించారు.

పత్తి రేట్లపై రైతుల ఆరా..

వరంగల్ సిటీలో ఏనుమాముల మార్కెట్ ఉండడంతో అక్కడ పత్తికి ఎంత ధర పలుకుతుందనేది తెలుసుకునేందుకు చాలామంది రైతులు వెతికారు. గూగుల్ చూపే సమాచారం ఆధారంగా పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలా? వద్దా? అనేది రైతులు నిర్ధారించుకుంటున్నారు. అలాగే వరంగల్ వెదర్ తెలుసుకునేందుకు చాలామంది వెతికారు. ఇది పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం ధరలు తెలుసుకునేందుకు ఎక్కువగా శోధించారు. జ్యువెల్లరీ దుకాణాలకు వెళ్లాక ఆన్‌లైన్‌లోనూ వెతికి అక్కడా వారు చెప్పే రేటుతో పోల్చి కొనుగోలు చేసేందుకు కూడా మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా వరంగల్ పర్యాటక ప్రాంతం కావడంతో ఇక్కడికి వచ్చే రైళ్ల గురించి ఆన్‌లైన్‌లో వాకబు చేసినట్లు కనిపించింది.

ఫస్ట్ ఒపీనియన్..

ఏ చిన్న అవసరమున్నా.. ఏ సందేహమున్నా ఆన్‌లైన్‌లో వెతకడం ఈరోజుల్లో మామూలైంది. ఇదివరకు ఏ డౌట్ వచ్చినా స్నేహితులనో, తెలిసిన వాళ్లనో అడిగేవారు. కానీ ప్రస్తుతం అరచేతిలో ప్రపంచాన్ని చూస్తున్నారు. సందేహాన్ని నివృత్తి చేసుకుంటున్నారు. ఫుడ్, లాంగ్ డ్రైవ్, విజిటింగ్ ప్లేసెస్, బెస్ట్ రెస్టారెంట్స్ ఇలా.. గూగుల్‌ను ఫస్ట్ ఒపీనియన్ అడుగుతున్నారు.

కుటుంబంతో పర్యటించా..

ఎన్నో రోజులుగా వరంగల్‌లోని పర్యాటక ప్రాంతాల్ని చూద్దామనుకున్నా. వరంగల్ కోటతో పాటు రామప్ప, లక్నవరం ప్రాంతాల గురించి గూగుల్లో వెతికిన. లాంగ్ డ్రైవ్ కార్లు అందుబాటులో ఉన్నాయా? అని కూడా సెర్చ్ చేసిన. అలా సమాచారం తెలుసుకుని వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను కుటుంబంతో కలిసి సందర్శించిన.

\- అనిల్ గుప్తా, కరీంనగర్ వాసి



విద్యార్థులు బడిబయట ఉండొద్దు

గ్రామాల్లో డప్పు చాటింపు వేయించండి

- నూరుశాతం ప్రవేశాలు జరగాలి
- ఐటీడీఏ పీఓ అంకిత్


సమావేశంలో మాట్లాడుతున్న పీఓ అంకిత్


హాజరైన ఐటీడీఏ సెక్టార్ అధికారులు

ఏటూరునాగారం : స్థానిక ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో చదువుకునే విద్యార్థులు బడిబయట ఉండొద్దని, గొత్తికోయ, గిరిజన గూడేలు, తండాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎడ్యుకేషన్ అధికారులు డప్పు చాటింపు వేయించి విద్యార్థులను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ రీజియన్‌లోని ఇంటర్మీడియట్, టెన్త్‌పరీక్షలు సబ్జెక్టులు, ఫ్యాకల్టీ వారీగా ఫలితాలను ఏకీకృతం చేయాలని ఆర్‌సీఓ వెంకటేష్‌ను ఆదేశించారు.

- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన సంక్షేమ సంస్థలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు, ఆశ్రమ పాఠశాలల్లో 3 నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశానికి సంబంధించి అన్ని ఆవాసాలు, గ్రామాల్లోని టాంటాం చేయించాలని డీడీని ఆదేశించారు.
- ఎంఎస్‌ఎంఈ కార్యక్రమం కింద హార్టికల్చర్, కూరగాయలు, పండ్ల పెంపకం, సరఫరా యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ఆసక్తిగల జాయింట్ లయబిలిటీ గ్రూప్‌లను గుర్తించాలని, వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికను సిద్ధం చేయాలని పీహెచ్‌ఓ రమణను కోరారు.
- ఇప్పటికే భూగర్భజల శాఖ ద్వారా తవ్విన బోరుబావుల కోసం మోటారు, విద్యుత్ కనెక్షన్ల మంజూరు కోసం వస్తున్న లబ్ధిదారుల జాబితాను ఏకీకృతం చేసి ఐటీడీఏ స్థాయిలో చర్యలు తీసుకోవాలని పీఏఓను కోరారు.
- ఆవాసాల్లో నీటి సరఫరా ఏర్పాట్లపై ఏవైనా సమస్యలపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిషన్ భగీరథను ఆరా తీయగా, మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎటువంటి సమస్య లేదని డీఈ నివేదించారు.
- పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ ఆరేపల్లిలో కోచింగ్ క్యాంప్ నిర్వహించడం కోసం గ్రూప్–3, 4 కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను స్క్రీనింగ్ టెస్ట్‌ల ద్వారా ఎంపిక చేసి గుర్తించాలని వరంగల్ ఏసీఎంఓను కోరారు.
- సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడల్లో ఎంతమంది పాల్గొంటున్నారని, పాల్గొనే వారికి భోజన ఏర్పాట్లపై ఏటూరునాగారం ఎంపీడీఓను ప్రశ్నించగా దాదాపు 500 మంది విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ఏటూరునాగారంలో నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కుమార్ వివరించారు. మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో భోజన ఏర్పాట్లు చేశామన్నారు.
- మేడారం జాతర ప్రతిపాదనలు 2024 ఏకీకరణ స్థితిపై ఐటీడీఏ ఎస్‌ఓ రాజ్‌కుమార్‌ను ప్రశ్నించగా కొన్ని శాఖలు సమర్పించలేదని, రెండు రోజుల్లో ప్రతిపాదనలను సేకరించి ఏకీకృతం చేస్తామని వివరించారు.
- పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సమీక్షించి వారం రోజుల్లో వాటిని అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యం చేసినా సమస్యలు పట్టించుకోకపోయినా వారికి శాఖపరమైన చర్యలుంటాయన్నారు. ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, ఏఓ దామోదరస్వామి, ఎస్‌ఓ రాజ్‌కుమార్, పీహెచ్‌ఓ రమణ, పీఏఓ భారతి, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఆర్‌సీఓ వెంకన్న, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓలు కుమార్, ఫణిచంద్ర, బాబు, డీఈఈ సతీష్, పెసా కోఆర్డినేటర్ ప్రభాకర్, జీడీఎం కొండల్‌రావు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే పీడీయాక్ట్

- సీపీ ఏవీ రంగనాథ్


వివరాలు వెల్లడిస్తున్న కాజీపేట ఏసీపీ

వరంగల్ క్రైం: వ్యవసాయదారులను మోసానికి గురిచేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా వీణవంక చెందిన రవిశెట్టి రవిబాబు వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి వారికి ఇవ్వాల్సిన డబ్బుల ఎగవేతకు పాల్పడినందుకు నిందితుడిపై వరంగల్ కమిషనరేట్ పరిధిలో తొలిసారిగా సీపీ పీడీయాక్ట్ ఉత్తర్వులను జారీ చేశారు. సీపీ జారీ చేసిన పీడీయాక్టు ఉత్తర్వులను కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ సోమవారం కాజీపేట ఏసీపీ కార్యాలయంలో అందజేసి నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నిందితుడు రవిబాబు వరంగల్, కరీంనగర్ జిల్లాలో సుమారు 6 టన్నుల వరి ధాన్యంను కొనుగోలు చేసి రైతులకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా రూ.కోటిన్నర చెల్లించకుండా ఎగవేతలకు పాల్పడ్డాడు. వ్యవసాయదారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్కతుర్తి, ముల్కనూర్, వరంగల్ పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై కేసులు నమోదు కావడంతో నిందితుడిపై పీడీయాక్టు ఉత్తర్వులను జారీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్ ఎస్సై మహేందర్ పాల్గొన్నారు.

మానుకోట జనరల్ ఆస్పత్రిలో బాలింత మృతి


భాగ్యలక్ష్మి

నెహ్రూసెంటర్ : మెరుగైన చికిత్స కోసం వచ్చిన ఓ బాలింత మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలి భర్త వద్దూరి వెంకటేష్ కథనం ప్రకారం ..జిల్లాలోని మరిపెడకు చెందిన వద్దూరి భాగ్యలక్ష్మి (23) రెండో కాన్పు కోసం వచ్చి మరిపెడ పీహెచ్‌సీలో మగశిశువుకు జన్మనిచ్చింది. ఉదయం 10.45 గంటలకు ప్రసవం జరిగిన కొంత సమయం నుంచి ఆమె మానసిక స్థితి సరిగాలేనట్లుగా ప్రవర్తించింది. విధుల్లో ఉన్న మరిపెడ పీహెచ్‌సీ డాక్టర్ రవి ఆమెకు చికిత్స అందించారు. సాయంత్రం 3 గంటల సమయంలో భాగ్యలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లమని సూచించారు. మెరుగైన వైద్యం కోసం మానుకోటకు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు వైద్య చికిత్స మొదలుపెట్టారు. కొంత సమయం పాటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆమెకు ఆయాసం తగ్గకపోవడంతో వరంగల్‌కు తీసుకెళ్లమని సూచించారు. వెంటనే అంబులెన్స్ ఎక్కిస్తుండగా మృతి చెందింది. మరిపెడ వైద్యాధికారి నిర్లక్ష్యంతోనే తన భార్య మృతి చెందిందని వెంకటేష్ ఆరోపించాడు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరాడు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

- జీరో దందాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- జేడీఎంకు రైతు సంఘం ఫిర్యాదు


జేడీఎం మల్లేశంకు ఫిర్యాదు చేస్తున్న రైతు సంఘం నాయకులు

వరంగల్ : వరంగల్ ఏనుమాములలోని వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, కార్యదర్శి ఓదెల రాజయ్య అన్నారు. సోమవారం మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు ఈ.మల్లేషంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే 2వ అతి పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా గుర్తింపు పొందిందన్నారు. మార్కెట్‌కు రైతులు తమ పంటను అమ్ముకునేందుకు నల్గొండ, ఖమ్మం, కరీంనగర్‌లతో పాటు ఇతర రాష్ట్రాలనుంచి రైతులు పెద్ద సంఖ్యలో పత్తి, మిర్చి, అపరాలు తీసుకొస్తూ విక్రయాలు చేస్తారని అన్నారు. మధ్యవర్తి(అడ్తిదారులు)గా ఉన్న కొందరు వ్యాపారులు మార్కెట్ అధికారులతో కుమ్మక్కై వచ్చిన సరుకులను జీరోగా వైట్‌పేపర్లపై పట్టీలు పెడుతూ రోజు వచ్చే లక్షల రూపాయల ఆదాయాన్ని రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మార్కెట్‌లో క్రిందిస్థాయి ఉద్యోగస్తులు వేధింపులకు గురవుతున్నట్లు, అక్రమాలు జరుగుతున్నట్లుగా ప్రింట్ మీడియాల్లో వార్తలు వస్తున్నాయన్నారు. ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్‌లో జరిగే అన్ని విషయాలపై సమగ్ర విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మార్కెట్‌లో పనిచేసే ప్రతిఒక్కరూ రైతుల ప్రయోజనాలు కాపాడే విధంగా సమన్వయంతో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సిరుల రవీందర్, జెండా అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి దూసుకెళ్లిన లారీ

- అక్కడికక్కడే కూలీ మృతి
- రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆందోళన
- పోలీసులు నచ్చజెప్పడంతో విరమణ


క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల పంచాయతీ పరిధిలోని కుంట్లం–3 ఇసుక క్వారీ వద్ద వేసవి తాపంతో చెట్టునీడలో నిద్రిస్తున్న కూలీపై నుంచి లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... పలుగుల గ్రామానికి చెందిన పసుల ఎర్రయ్య(55) ఇసుక క్వారీలో లారీలో ఇసుక లోడింగ్ చేసిన తర్వాత లారీపైకి ఎక్కాడు. టార్పాలిన్ వేసే పనికి సోమవారం తోటి కూలీలతో రోజులాగానే వెళ్లాడు. ఎండ తీవ్రత పెరగడంతో చెట్టు నీడకు కుంట్లం–3 క్వారీకి వెళ్లే దారి పక్కన సేదతీరాడు. ఇసుక లోడింగ్ కోసం వచ్చిన లారీ నిద్రిస్తున్న కూలీ తలపైకి ఎక్కింది. దీంతో ఆ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ అన్నారం ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లారీలను నిలిపేసి ధర్నాకు దిగారు. దీంతో సీఐ కిరణ్‌కుమార్, కాళేశ్వరం, మహదేవపూర్ ఎస్సైలు లక్ష్మణ్‌రావు, రాజ్‌కుమార్, భవానీసేన్‌లు తన సిబ్బందితో క్వారీ వద్దకు చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి నచ్చచెప్పారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని కదలనిచ్చేది లేదని రోడ్డుపై బైఠాయించారు. క్వారీ కాంట్రాక్టర్లు, టీఎస్‌ఎండీసీ తరుపున మృతుడి కుటుంబానికి రూ. 10 లక్షల సాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు తెలిసింది. మృతదేహాన్ని మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి భార్య భూదక్క, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌పై అట్రాసిటీ కేసు

ఎంజీఎం : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. ఎంజీఎం ఆస్పత్రిలో కాసు రాములు(46) శనివారం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని ఆరోపిస్తూ గిరిజన సంఘాలు నేతలు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో సూపరింటెండెంట్‌తో చర్చలు జరిపే క్రమంలో గిరిజన నాయకుడు గుగులోతు తిరుపతి మధ్య వాగ్వాదం జరిగింది. గతంలో ఇదే ఆస్పత్రిలో తమ మేనల్లుడు ఇంజక్షన్ వికటించి మృతి చెందాడని తిరుపతి గుర్తు చేయగా.. 'ఈ లంబాడా కమ్యూనిటీకి వేరే పని ఉండదు.. వీరి మాటలను నమ్మకూడదు' అంటూ కించపరిచాడని పేర్కొంటూ అతను మట్టెవాడ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. తనను దూషించిన సమయంలో రాజు, విజయ్ అనే వ్యక్తులు కూడా ఉన్నట్లు తిరుపతి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గిరిజన సంఘాల నేతలపై కేసు..

ఇదిలా ఉండగా.. కాసు రాములు మృతి ఘటన విషయంలో అతడికి సంబంధం లేని గుర్తు తెలియని వ్యక్తులు మార్చురీ నుంచి మృతదేహాన్ని ఆస్పత్రి క్యాజువాలిటీ వద్దకు తీసుకొచ్చి ఆర్‌ఎంఓ, సీఎంఓలను దూషించినట్లు సూపరింటెండెంట్ మట్టెవాడ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆజ్మీరా వెంకట్, విజయ్, తిరుపతితో పాటు మరికొందరు సీఎం గదిలోకి ప్రవేశించి సూపరింటెండెంట్‌తో పాటు ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లపై దాడికి దిగే ప్రయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు రెండు గంటల పాటు వైద్యులంతా పోలీసుల సహాయంతో సీఎంఓ గదిలో ఉండాల్సిన వచ్చిందని తెలిపారు. వైద్యుల విధులకు ఆటంకం కలిగించారని సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకట్, విజయ్, తిరుపతిపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్థల వివాదంపై మహిళ ఆత్మహత్యాయత్నం

- పోలీసులు కొట్టారని బాధితురాలి కుమారుడి ఆరోపణ


చికిత్స పొందుతున్న ముత్తమ్మ

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని ఓ ఇంటి స్థల వివాదం విషయంలో ఓ మహిళ పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థల వివాద విషయంలో తన తండ్రిని కొట్టారని బాధితురాలి కుమారుడు ఆరోపించారు. బాధితురాలి కుమారుడు నాగరాజు కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని బేతోలుకు చెందిన మీసాల ముత్తమ్మ–రాములు దంపతులు 2015లో మారంరాజు నారాయణరావు, బోయినపల్లి శ్రీకాంత్ వద్ద జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రి పక్కన 100 గజాల ఖాళీ స్థలాన్ని రూ.12 లక్షలకు కొనుగోలు చేశారు. బయానా కింద యజమానికి రూ. 32 వేలు ఇచ్చారు. 2019లో గెట్టుపెట్టి అగ్రిమెంట్ రాసుకునే సమయంలో కురవి మండలం కాంపల్లి శివారు బీల్యా నాయక్ తండాకు చెందిన కేలోత్ బిక్కు సాక్షిగా ఉన్నాడు. అప్పటి నుంచి ఆ దంపతులు ఆ స్థలంలోనే రేకుల షెడ్డు వేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. ఆ దంపతులకు తెలియకుండా కేలోత్ బిక్కు భార్య జ్యోతి పేరు మీద ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేశారని తెలిసింది. 2021 నుంచి బిక్కు ఆ స్థలం నాదే అనడంతో బిక్కుకు, ముత్తమ్మ దంపతులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. నాలుగు నెలల క్రితం రాములు–ముత్తమ్మ నిద్రిస్తున్న సమయంలో బిక్కు పెట్రోల్ పోసి రేకుల షెడ్డును తగలబెట్టారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు ఇవ్వగా పోలీసులు విచారణ జరిపి బిక్కుపై కేసు నమోదు చేశారు. మే 3న బిక్కు జ్యోతి వారి కుమారుడు ముత్తమ్మ–రాములుతో గొడవపడి గొడ్డలి, కత్తులతో దాడి చేసి హత్యాయత్నం చేయగా వారు తప్పించుకున్నారు. జరిగిన విషయంపై పోలీసుల దృష్టికి తీసుకెళ్ళడం కోసం టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి దరఖాస్తు ఇవ్వడానికిపోతే టౌన్ సీఐ సతీష్ దరఖాస్తు తీసుకోకుండా నాగరాజును పిలిచి అసభ్యకర పదజాలంతో దూషించారు. జరిగిన సంఘటనలపై విచారణ జరిపించి తమకు న్యాయం చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవా లని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం టౌన్ ఎస్సై విజయ్‌రాంకుమార్, కానిస్టేబుళ్లు ముత్తమ్మ ఇంటి వద్దకు స్థలం అమ్మిన యజమాని శ్రీకాంత్‌ను తీసుకెళ్లారు. ఇరువర్గాల వాదనలు నడుస్తూ పోలీసులు మాట్లాడుతుండగానే ముత్తమ్మ ఇంట్లోకి వెళ్లి పురుగుల మందుతాగి కిందపడిపోయింది. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ వై.సతీష్‌ను వివరణ కోరగా ఇంటి స్థలం వివాదం విషయంలో ముత్తమ్మ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణలో భాగంగా ఆమెను పీఎస్‌కు రమ్మని చెప్పాం. ఆమె రాకపోవడంతో టౌన్ ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్ళు సంఘటన స్థలానికి యజమానిని తీసుకుని వెళ్లి మాట్లాడారు. అంతలోనే ఆమె పురుగుల మందు తాగగా పోలీసులు ఆమెను ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

దర్గాలో సైకో లేడీ అరెస్ట్


కాజీపేట రూరల్ : కాజీపేట 48వ డివిజన్ దర్గా ప్రాంతానికి చెందిన సైకో లేడీని సోమవారం కాజీపేట సీఐ సార్ల రాజు అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..దర్గాలో రోడ్‌నంబర్ 7లో నివాసం ఉంటున్న బానోత్ వనజ గత ఐదేళ్ల నుంచి చుట్టుపక్కల ప్రాంత ప్రజలను తన సైకో వీరంగంతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ తన పెంపుడు కుక్కతో ఇతరులపైకి దాడి చేయిస్తూ పైశాచిక ఆనందం పొందుతోంది. చుట్టుపక్కల వారిని అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు, కారంపొడి, కత్తులతో దాడి చేయడం తనకు రోజు పాలు పోస్తున్న పాలవ్యాపారిపై దాడిచేయడం వంటి పనులు చేయడంతో పాటు వారం క్రితం తన ఇంటి ముందు నివాసం ఉంటున్న వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో పలు ఫిర్యాదు అందిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు విచారణ అనంతరం సీఐ సైకో వనజను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. సైకోను జైలుకు తరలించడంతో సీఐ, పోలీసులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

గణపురం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన అంబటి రాకేష్(19) ఇంటర్ విద్యార్థి ఇటీవల వచ్చిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గణపురం పోలీసుల కథనం ప్రకారం.. బస్వరాజుపల్లికి చెందిన అంబటి కవిత–కుమారస్వామి దంపతుల కుమారుడు రాకేష్ హనుమకొండలోని ఒక ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన రాకేష్ సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని..

- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి


తేజావత్ సింధు

గూడూరు: ఇంటర్ ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో పురుగుల మందుతాగిన విద్యార్థిని చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడుకు చెందిన తేజావత్ పూలు, లీల దంపతుల కూతురు సింధు (17) ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయింది. దీంతో మనస్తాపానికి గురైన సింధు మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగి పడుకుంది. తెల్లవారిన తర్వాత ఇబ్బంది పడిన సింధు తాను పురుగుల మందు తాగినట్లు తల్లిదండ్రులకు చెప్పగా గూడూరు ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు.. తర్వాత హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సింధు మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వల్మిడిలో మతిస్థిమితం లేని యువకుడు..

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడిలో మతిస్థిమితం లేని యువకుడు కుటికంటి జంపన్న(28) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం వల్మిడికి చెందిన కుటికంటి ఎల్లగౌడ్, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు మతిస్థిమితం కోల్పోయి బాధపడుతున్నాడని తెలిపారు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జంపన్న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. మృతుడి తండ్రి ఎల్లగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు.

అర్జీలను వెంటనే పరిష్కరించండి


గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్లు అశ్విని, శ్రీవత్స కోట

కరీమాబాద్: వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు, దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీవత్స కోట అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం వారు ప్రజల నుంచి ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమస్యలు స్థానికంగా పరిష్కారం కాకపోవడంతో ఇక్కడికి వస్తున్న నేపథ్యంలో వాటిని జాప్యం చేయొద్దని సూచించారు. గ్రీవెన్స్‌కు 63 దరఖాస్తులు రాగా.. వాటిని ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు బదలాయించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

లోన్ సాంక్షన్ అయినా.. ఇస్తలేరు



నాకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఏడాది కింద టెంట్‌హౌజ్ కోసం రూ.2 లక్షల లోన్ సాంక్షన్ అయ్యింది. జీపీ నుంచి పర్మిషన్ కూడా తీసుకున్న. లోన్‌కు సంబంధించిన డబ్బుల చెల్లింపుల విషయంలో బ్యాంకు వాళ్లు ఇబ్బందులు పెడుతున్నారు. బ్యాంకు చుట్టూ, ఎస్సీ కార్పొరేషన్ చుట్టూ తిరిగి విసిగిపోయి కలెక్టర్‌కు ఫిర్యాదు చేద్దామని వచ్చా.

– ఎర్ర యాకయ్య, దమ్మన్నపేట, వర్ధన్నపేట మండలం

ధరణిలో భూమి చూపిస్తలేదు



మా భూమి ధరణిలో చూపిస్తలేదు. ఇతరుల పేరు మీద పట్టా చేసినట్లు కనిపిస్తోంది. ఈ విషయంలో ఎమ్మార్వో ఆఫీసు చుట్టూ తిరిగినం. సర్వే నంబర్ 183, 184లో ఉండే మా భూమి ఇప్పుడు రికార్డుల్లో లేదు. పోయిన వారం వచ్చి కలెక్టర్‌ను కలిసినం. మళ్లీ ఇప్పుడు కూడా కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన. విచారణ జరిపి నా భూమి నాకు వచ్చేలా చూడాలని కోరుతున్నా.

– ఒగ్గు దుర్గయ్య, అన్నారం షరీఫ్, పర్వతగిరి మండలం

రికార్డుల్లో నమోదు కాలేదు



మేం మా గ్రామానికి చెందిన గుండెకారి కమలాదేవి దగ్గర 2018లో రెండెకరాల 17 గుంటల భూమి కొన్నాం. రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాం. 3 ఏళ్ల నుంచి ధరణిలో పెండింగ్‌లో ఉన్నట్లు వస్తోంది. రికార్డులు సరిచేయించి మా భూమి నమోదు చేయించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చినం.

– కొల్లూరి శ్రీదేవి, గీసుకొండ

మొక్కజొన్న పంట దగ్ధం

రాయపర్తి: షార్ట్‌సర్క్యూట్‌తో ఇద్దరు రైతులకు చెందిన మొక్కజొన్న పంటలు అగ్నికి ఆహుతైన సంఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని గణేష్‌కుంట తండాలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గణేష్‌కుంట తండాకు చెందిన మూనావత్ దేవేందర్ రెండెకరాలు, మూనావత్ బోజ్యా రెండెకరాల్లో మొక్కజొన్న పంటలను సాగుచేశారు. మొక్కజొన్న పంటలో నుంచి తీసిన విద్యుత్‌లైనునుంచి ఒక్కసారిగా మిరుగులు పడి మంటలు వచ్చి నాలుగు ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. మంటలు చెలరేగి మిగతా పంటలు నిప్పంటుకోవడంతో గమనించిన తండావాసులు రోటోవేటర్‌తో మంటలను ఆర్పినట్లు తండావాసులు తెలిపారు. రూ.3 నుంచి 4 లక్షల వరకు నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.